క్లుప్తంగా

నేడు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

తెనాలిఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించనున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు సాతులూరి రామ్‌ప్రసాద్, నరెళ్ళ కృష్ణ మోహన్‌రావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మారీసుపేట చెంచు రామానాయుడు స్కూల్ ఆవరణలోని మున్సిపల్ ఉర్దూ ఎలిమెంటరీ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయులు షేక్ అహ్మద్ హుస్సేన్‌ను సన్మానించనున్నట్లు వివరించారు.

ఆశ్రమాల్లో వృద్ధులకు అన్నదానం



తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మ ఆశ్రమం, నాజరుపేటలోని మన ఇల్లు ఆశ్రమం, గాంధీనగర్‌లోని షిరిడి సాయి ఆశ్రమాల్లో సోమవారం ఐపీఎస్ అధికారి ఉమేష్ చంద్ర వర్ధంతిని పురస్కరించుకొని ఆశ్రమాల్లో వృద్ధులకు అన్నదానం చేశారు. పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, ఉమేష్‌చంద్ర తల్లిదండ్రులు చదలవాడ వేణుగోపాలరావు, నయనతార, ఉమామహేశ్వరరావు, ఆశ్రమాల నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరరావు, భారతి, మురళి, అనూష, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

మంచి చెడు స్పర్శలపై అహగాహన

తెనాలిరూరల్: కిశోర బాలికలు మంచి చెండు స్పర్శలపై అహగాహన కలిగి ఉండాలని న్యాయవాది పేట ప్రత్యూష అన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని చైతన్య స్కూలులో మంచి చెండు స్పర్శలపై అహగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిశోర బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అదే విధంగా యుక్త వయసులో ఉన్న పిల్లలు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తల గురించి వివరిస్తూ అవగాహన కలిగించారు. ప్రత్యూష మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులే కాకుండా తెలిసిన వారుసైతం బాలికలతో చెడుగా ప్రవర్తించే సందర్భాలు ఉంటాయని, అలాంటి ఘటన ఎదురైతే వెంటనే సమీపంలోని గ్రామ/వార్డు సచివాలయంలో, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. 18 ఏళ్ల లోపు కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మహిళలకు రక్షణ కవచంగా వున్న దిశ యాప్ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో పీఎల్‌వీ యర్రంశెట్టి అనిల్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, మహిళా పోలీస్ కళ్యాణి, పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీపతిరావు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు మ్యూజికల్ చైర్ పోటీలు



తెనాలి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పట్టణ అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులకు మ్యూజికల్ చైర్ పోటీలను నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయినులకు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా ఈ పోటీలను జరిపారు. ఉపాధ్యాయిని విభాగంలో రాబియా బాసరి, జాన్‌బీ ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకోగా, ఉపాధ్యాయుల్లో కరిముల్లా, ప్రకాశరావు మొదటి, రెండు బహుమతులను సాధించారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని ప్రధానోపాధ్యాయుడు రాజకిశోర్ కోరారు. ఉపాధ్యాయుల ఆటల పోటీలు విద్యార్థులకు స్ఫూర్తిని ఇస్తాయని చెప్పారు. ప్రసూనాదేవి, అస్మతున్నీసా, వెంకటరమణ, బాలమ్మ, ప్రసాద్, మనోజ్, ఆంజనేయ శర్మ, విజయ్‌సింహా, నవీన్, శ్రీను, బెల్లంకొండ వెంకట్ పాల్గొన్నారు.

తెనాలి చేరుకున్న ప్రైవేట్ ఎలక్ట్రికల్ సంక్షేమ సమగ్ర సర్వే యాత్ర

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ సమస్యలపై దృష్టి సారించి, పరిష్కరించేందుకు కృషిచేయాలని అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కోరారు. ప్రైవేటు ఎలక్ట్రికల్ కార్మికుల సంక్షేమ సమగ్ర సర్వే యాత్ర సోమవారం తెనాలి చేరుకుంది. బాలాజీరావుపేటలోని సంఘ కార్యాలయం వద్దకు విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షుడు డీవీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కె.శ్రీహరిరావు, ఉపాధ్యక్షుడు కె.పాల్‌రాజు, కోశాధికారి ఎం.శ్రీధర్ రవిబాబుకు స్థానిక సంఘ నాయకులు ఘన స్వాగతం పలికారు. వర్కర్ల సమస్యలపై చర్చించారు. పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ది తెనాలి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అండ్ వైర్‌మెన్ పర్మిట్ హోల్డర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పసుపులేటి పూర్ణచంద్రరావు, కార్యదర్శి తాడిబోయిన సోమసుందర్, కోశాధికారి పెదలంక వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు వాసు, సంయుక్త కార్యదర్శి మేకల నాంచారయ్య, గౌరవ అధ్యక్షుడు మంగళాపురపు నటరాజబాబు పాల్గొన్నారు.

పట్టణంలో కొత్తగా 864 పింఛన్లు

- సామాజిక పింఛన్లతో అవ్వాతాతలకు, వికలాంగులకు భరోసా
- పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, చైర్మన్ ఖలేదా నసీమ్

తెనాలిఅర్బన్: సామాజిక పింఛన్ల పంపిణీ ద్వారా అవ్వాతాతల్లో ఆర్థిక భరోసా ఏర్పడిందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక కార్యక్రమాన్ని కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పింఛన్ల పంపిణీలో అనేక మార్పులు తీసుకువచ్చిందని గుర్తు చేశారు. గతంలో పింఛన్లకు అర్హత ఉన్నా పింఛన్లు అందేవి కావన్నారు. లబ్ధిదారుల్లో ఎవరైనా మరణిస్తేనే కొత్తవారికి ఇచ్చేవారని తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అర్హతే ప్రామాణికంగా అందరికీ పింఛన్లు అందజేయడం జరుగుతోందన్నారు. అలాగే వృద్ధులు, వికలాంగులు, పింఛన్ల పంపిణీ కేంద్రం వద్ద రోజుల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి గత ప్రభుత్వ హయాంలో ఉండేదన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి నెల ఒకటో తేదీన ఉదయం లబ్ధిదారుల ఇళ్ళ వద్దే పంపిణీ జరుగుతోందన్నారు. కులాలు, మతాలు, ప్రాంతాలు, రాజకీయ పార్టీలు చూడకుండా అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. తమ ప్రభుత్వం సామాజిక పింఛన్లను ఒకటవ తేదీనే ఇస్తుండటం వలన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. తెనాలి నియోజకవర్గంలో మొత్తం 37వేల పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు. వీటికి రూ.10 కోట్లు ప్రతి నెల వెచ్చిస్తున్నట్లు చెప్పారు. తెనాలి పట్టణంలో 15,809, తెనాలి మండలంలో 11,382, కొల్లిపర మండలంలో 10,002 పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు పదవి విరమణ చేసిన తరువాత కలిగే భద్రతను ప్రభుత్వం సామాజిక పింఛన్ల పంపిణీ ద్వారా వృద్ధులకు, వికలాంగులకు కల్పిస్తుందని వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కమిషనర్ ఎం.జశ్వంతరావులు మాట్లాడుతూ ఎటువంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక, పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందించే పింఛన్లు జీవనోపాధికి ఎంతో ఉపయోగపడుతున్నాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం తెనాలి పట్టణంలో నూతనంగా మంజూరు అయిన 864 పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, కౌన్సిలర్లు అన్నాబత్తుని పద్మజ, కొర్ర యశోద, షేక్ ఇస్మాయేల్, యాతాటి అనిల్, షేక్ దుబాయ్‌బాబు, మొగల్ అహ్మద్‌బేగ్, దాసరి వసంతరావు, గొడవర్తి సాయిహరేరామ్, తోట రఘురామ్, వీర్లపాటి విజయలక్ష్మి, పేరం సంజీవరెడ్డి, గోగిరెడ్డి మానస రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రావి ప్రశాంతి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కుక్కల ముక్తేశ్వరరావు, నాయకులు బూరెల దుర్గా, కోలా వాసు, ధరణికోట మల్లి, కఠారి హరీష్, అక్కిదాసు కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడుకులా ఆదుకుంటున్న సీఎం జగన్



కుటుంబంలో పెద్దకొడుకులా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమను ఆదుకుంటున్నాడు. ప్రభుత్వం అందించే పింఛను జీవనోపాధికి ఎంతో దోహదపడుతుంది. అది కాకుండా పింఛను ప్రతి నెల ఒకటో తేదీనే తమ ఇళ్ళ వద్దే వలంటీర్లు అందజేస్తున్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

కోడూరి మాణిక్యమ్మ, వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారురాలు

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



తమ కుమార్తె కంభంపాటి కీర్తికి చిన్నప్పటి నుంచి మాటలు సరిగ్గా రావు. అంతేకాకుండా మానసిక వికలాంగురాలు. సదరమ్ సర్టిఫికెట్ ఆలస్యంగా రావడం వలన తమ కుమార్తెకు ఇప్పటి వరకు పింఛన్ రాలేదు. వార్డు సచివాలయంలో సర్టిఫికెట్ అందజేసిన వెంటనే మా కుమార్తెకు వికలాంగ పింఛన్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందని ఆమె తండ్రి ముక్తేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటామని చెప్పారు.

కంభంపాటి కీర్తి, మానసిక వికలాంగురాలు

'మధురకవి' నూతక్కి అబ్రహాం విగ్రహ ఏర్పాటుకు వినతి



ఎమ్మెల్యే శివకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న

కొలకలూరు(తెనాలి): పట్టణంలో ప్రతిష్టాత్మకంగా రూపుదిద్దుకుంటున్న తెనాలి బండ్‌పై రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన 'మధురకవి' నూతక్కి అబ్రహాం విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని ఆ గ్రామానికి చెందిన మండల వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న, గ్రామస్తులు సోమవారం వినతి పత్రం అందజేశారు. 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే శివకుమార్‌ను కలిసి విజ్ఞప్తిచేసినట్టు సాయంత్రం ఒక ప్రకటనలో తెలియజేశారు. మహాకవి గుర్రం జాషువా ప్రియశిష్యుడైన నూతక్కి అబ్రహాం, తన సాహిత్యంతో జాతీయస్థాయి గుర్తింపు పొందారనీ, కవికోకిల, కావ్యకళానిధి బిరుదులు పొందారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ అబ్రహాం విగ్రహ ఏర్పాటుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు దోసపాటి నాగదేవిక, కాలిశెట్టి ఫణికుమార్, చెక్కా సీతమ్మ, ప్రసాదం బాలగురవమ్మ, నల్లూరి సుమతి, కొలకలూరి నాగేశ్వరరావు, కోడూరు రమేష్, కొలకలూరి పాపారావు, కొలకలూరి చలమయ్య, కొలకలూరి మోషే, మల్లవరపు బాబీ, పినపాటి అనిల్‌కుమార్, సుద్దపల్లి కనకరాజ్, పాస్టర్ సురేష్, సుద్దపల్లి వీరయ్య, మల్లవరపు బుల్లియ్య, ఉన్నం గోవర్ధన్, కొలకలూరి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూనికేతన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



తెనాలిఅర్బన్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో సోమవారం వైభవంగా నిర్వహించారు. చిన్నారులు గోపికలు, రాధ, కృష్ణుని వేషధారణలు అందరినీ అలరించాయి. అలాగే ఉట్టిని కొట్టే కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక గవర్నర్ ఎదుట తెనాలి చిన్నారుల నృత్యం



గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్‌తో చిన్నారులు, వారి తల్లిదండ్రులు

తెనాలి: పట్టణానికి చెందిన చిన్నారులు గ్రీష్మశ్రీ (6), తహసీన్ (11) అరుదైన అవకాశాన్ని అందుకున్నారు. బెంగళూరులోని రాజ్‌భవన్‌లో కర్ణాటక రాష్ట్ర గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ఎదుట శాస్త్రీయ నృత్యాన్ని ప్రదర్శించారు. చిన్నారుల నృత్యాభినయాన్ని తిలకించిన గవర్నర్, చిన్నారులను ఆశీర్వదించారు. నగదు బహుమతిని అందజేశారు. తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని, రాజ్‌భవన్ నుండి ఆహ్వానం రావటం, గవర్నర్ నుండి తమ బిడ్డలకు ఆశీర్వచనం లభించటం ఎంతో ప్రోత్సాహకరంగా ఉందని గ్రీష్మశ్రీ, తహసీన్‌ల తల్లిదండ్రులు బెంగళూరు నుంచి స్థానిక విలేకరులకు తెలియజేశారు. ప్రముఖ నృత్యగురువు నిర్మలా రమేష్ శిక్షణలో నృత్యసాధన చేస్తున్న గ్రీష్మశ్రీ, తహసీన్‌లు చిన్నవయసులోనే చక్కని ప్రతిభను సాధించారని చెప్పారు. ఈ చిన్నారులను మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా అభినందించారు.

ప్రియుడు ఇంటి ముందు ప్రియురాలు ఆత్మహత్యాయత్నం

మంగళగిరి: విజయవాడ కృష్ణనగర్‌లో నివాసముంటున్న సుధీర్, పూజిత గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. సుధీర్ కుటుంబం గత కొద్ది రోజుల క్రితం నగర పరిధిలోని ఆత్మకూరులో నివాసముంటున్నారు. పూజిత ఎంత ప్రయత్నించినా సుధీర్ సమాధానం చెప్పకపోవడంతో పూజిత మంగళవారం రాత్రి సుధీర్ నివాసానికి చేరుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే స్పందించిన స్థానికులు ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించినట్లు ఎన్ఆర్ఐ ఆసుపత్రి వర్గాలు తెలిపారు.

ఉమేష్‌చంద్రకు ఘన నివాళి



ఉమేష్‌చంద్ర విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఖాలేదా నసీం , డీఎస్పీ జనార్ధనరావు

తెనాలిరూరల్: దివంగత ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్‌చంద్ర 24 వ వర్ధంతిని సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సబ్ డివిజన్ పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో చెంచుపేటలో జరిగిన కార్యక్రమంలో ఉమేష్‌చంద్ర కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీం, డీఎస్పీ బి.జనార్ధనరావు, పలువురు పోలీస్ అధికారులు, ఉమేష్‌చంద్ర కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐపీఎస్ అధికారిగా ఉమేష్‌చంద్ర సేవలను పలువురు గుర్తు చేసుకున్నారు. యువతరం ఆయన ధైర్య సాహసాలను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. విధి నిర్వహణలో ఆయన చూపిన అంకిత భావం ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అసాంఘిక శక్తులపై ఉమేష్‌చంద్ర ఉక్కు పాదం మోపారని గుర్తు చేసుకున్నారు. అటువంటి నిజాయితీ కలిగిన అధికారిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. తెనాలి త్రీ టౌన్ పోలీసుల పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సీఐలు కె.చంద్రశేఖర్, ఎస్.వెంకట్రావు, రమేష్ బాబు, శ్రీనివాసరెడ్డి, ఎస్ఐలు విజయ్ కుమార్, ఉమా మహేశ్వరరావు, బి.శివరామయ్య, ఉమేష్‌చంద్ర తండ్రి చదలవాడ వేణుగోపాలరావు, కుటుంబ సభ్యులు, సన్నిహితులు దేవాభక్తుని ఉమామహేశ్వరరావు, తుమ్మల సత్యానారాయణ, కొడాలి రవీంద్ర, యలవర్తి లక్ష్మయ్య చౌదరి, కొండా శివారెడ్డి, ఆళ్ల వీరారెడ్డి, అయినంపూడి కోటేశ్వరరావు, రావెళ్ల మురళి, ముద్దాభక్తుని రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అనధికార ఇసుక ట్రాక్టర్లతో ప్రభుత్వ ఆదాయానికి గండి

'స్పందన'లో అసోసియేషన్ నేతల వినతి



సమస్యను వివరిస్తున్న ట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు

తెనాలి: స్పందన సమావేశంలో వచ్చిన అర్జీలను నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి కృషిచేస్తామని స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి వెంకటస్వామి చెప్పారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజలనుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మొత్తం నాలుగు అర్జీలు అందాయి. ఆయా విభాగాధికారులకు పంపి, పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు. లంక గ్రామాల నుంచి అనధికారికంగా పట్టణంలోకి వస్తున్న ఇసుక ట్రాక్టర్లను నియంత్రించాలని కోరుతూ శ్రీమణికంఠ ట్రాక్టర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెనాలి నాయకులు స్పందనలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నిర్ణయించిన సీనరేజి రుసుమును రీచ్‌లలో చెల్లించి, బిల్లుతో ట్రాక్టర్లకు ఇసుక లోడింగ్ చేసుకుని, చట్టబద్ధంగా తెనాలి, పరిసర గ్రామాల్లో ఇసుక సరఫరా చేస్తున్నట్టు తెలియజేశారు. కొల్లూరు, పెసర్లంక, గాజుల్లంక, చిలుమూరు మొదలైన నదీతీర లంక గ్రామాల నుంచి ఇసుకను బిల్లులు లేకుండా, ప్రభుత్వానికి ఎలాంటి రుసుము చెల్లించకుండా ప్రతిరోజూ 30 ట్రాక్టర్లకుపైగా అక్రమంగా తెనాలికి వస్తున్నాయని వారు ఆరోపించారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందని, తాము ఆర్థికంగా నష్టపోతున్నామని తెలిపారు. దీనిపై విచారించి తగిన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా తమ ట్రాక్టర్లకు 'నో ఎంట్రీ టైమ్', ఇతర సమయాల్లో నిలుపుకునేందుకు తగిన ప్రదేశాన్ని కేటాయించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో జేబీ కృష్ణ, కె.నరేష్‌రెడ్డి, చుక్కా కృష్ణ, సుభాష్, సుబ్బారావు, కె.రాఘవులున్నారు.

మండల తహసీల్దార్ కార్యాలయంలో...

స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన సమావేశంలో మొత్తం మూడు అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ కె.రవిబాబు అర్జీలను స్వీకరించారు.

అనమర్లపూడి రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే

- రూ.42 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం
- కొలకలూరులో 10వ రోజు గడపగడపకు మనప్రభుత్వం



సిమెంటురోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, పక్కన నాయకులు

తెనాలిటౌన్: అభివృద్ధిలో భాగంగా రూ.42 లక్షల మండల పరిషత్ నిధులతో కొలకలూరులో అనుమర్లపూడి డొంక సిమెంట్ రోడ్డును నిర్మించినట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. రూరల్ మండలం కొలకలూరులో 10వ రోజు సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, అధికారులు, వలంటీర్లతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది సమస్యలను నమోదు చేసుకున్నారు. సైడుకాల్వలు ఏర్పాటు చేయాలని, డ్రైయిన్స్ నిర్మించాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. ఇళ్ళ స్థలాలు ఇప్పించాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అనుమర్లపూడి సిమెంటు రోడ్డును ఏర్పాటు చేశామన్నారు. అర్హులకు ఇళ్ళ స్థలాలు రెండో విడత మంజూరు చేస్తామని తెలిపారు. ఇళ్ళ స్థలాలు మంజూరైన వారు ఇళ్లు నిర్మించుకోవాలని, ప్రభుత్వం ద్వారా రూ.1.80 లక్షలు ఇప్పిస్తామని, డ్వాక్రా మహిళలకు బ్యాంకు ద్వారా రూ.30 వేలు రుణం అందిస్తామని చెప్పారు. పార్టీ నాయకులు కొమ్మమూరు కాల్వవంతెన నుంచి గ్రామ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనమర్లపూడి డొంక సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే శివకుమార్ ప్రారంభించారు. సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేశారు. తెలుగు బాప్టిస్టు చర్చిలో ప్రార్థనలు చేశారు. పాస్టర్ సురేష్ ప్రార్థన చేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కోడూరి స్వప్న, ఎంపీటీసీలు నాగదేవిక, కాలిశెట్టి ఫణీకుమార్, సొసైటీ చైర్మన్ గంపల పెద్దబ్బాయి, డిసిఎంఎస్ డైరెక్టర్‌ప్రసాదం బాలగురవమ్మ, పార్టీట నాయకులు మల్లవరపు బుల్లయ్య, విజయ్, కోడూరి రమేష్, కొలకలూరి నాగేశ్వరరావు, పాపారావు, రాజయ్య, రావూరి రవిబాబు, కొమ్ము రాయల్, ప్రసాదం సురేష్, దూళ్ళ శ్రీనివాస్, కార్తికేయ, ఉన్నం రాజేంద్ర, గోవర్ధన్, ప్రసాదం రాధారావు, అమీర్‌బాషా, కొలంటి దాసు, సుద్దపల్లి నవీన్, ముసలయ్య, వీరయ్య, నలుకుర్తి జోసఫ్, పామర్తి సుబ్బారావు, పాలిశెట్టి కోటేశ్వరరావు, అంచే రోశయ్య, పంచాయతీరాజ్ డీఈ గుప్తా, ఎఇ వెంకటేశ్వరరావు, ఎలక్ట్రికల్ ఏఈ వసంతరావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌లు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు వీరే...

తెనాలి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వివిధ కేటగిరీల్లో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను సోమవారం సాయంత్రం ప్రకటించారు. వీరిలో తెనాలి నియోజకవర్గంలోని ఆరుగురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. గురుపూజోత్సవం రోజున వీరు జిల్లాకేంద్రంలో జరగనున్న వేడుకల్లో అవార్డులను స్వీకరిస్తారు.

అళహరి శివరామకృష్ణ....



రూరల్ మండలం సంగంజాగర్లమూడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడు అళహరి శివరామకృష్ణకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. వీరు 1989లో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా వృత్తిలోకి ప్రవేశించారు. వేమూరు నియోజకవర్గంలోని చుండూరు, తెనాలి నియోజకవర్గంలోని తెనాలి రూరల్ మండలాల్లోని వివిధ పాఠశాలల్లో పనిచేశారు. తర్వాత స్కూల్ అసిస్టెంట్ (మాథ్స్)గా పదోన్నతి పొందారు. గత 21 సంవత్సరాలుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ వచ్చారు. 2019లో ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందారు. సమర్థంగా పనిచేస్తూ విద్యార్థుల్ని తీర్చిదిద్దుతున్నారు.

ఇ.అంబరీషుడు...



తెనాలిలోని కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్) ఇ.అంబరీషుడు జిల్లా ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. వీరు 1984లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. తొలుత ఎస్‌జీటీగా ఆరంభించి, 2005లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. ఉపాధ్యాయ విధులతోపాటు అక్షరదీప్తి కార్యక్రమంలో చురుకుగా పనిచేశారు. తెనాలి మున్సిపాలిటీ లిటరసీ ఆర్గనైజర్‌గా కృషి చేశారు. పల్స్ పోలియో కార్యక్రమంలో పట్టణ మున్సిపాలిటీ నోడల్ అధికారిగా ఈ కార్యక్రమ విజయవంతానికి పనిచేశారు. పర్యావరణ విద్యపైనా ప్రత్యేక శిక్షణ పొందారు. వరద సహాయక చర్యల్లోనూ పాల్గొన్నారు.

షేక్ అస్మతున్నీసా...




పట్టణ అయితానగర్‌లోని కేఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)గా పనిచేస్తున్న షేక్ అస్మతున్నీసా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఎంఏ తెలుగులో యూనివర్శిటీ ద్వితీయ ర్యాంకును సాధించారు. 1995 నుంచి ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయినిగా పనిచేసి, 2016లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా తెనాలిలో స్థిరపడ్డారు. తొలుత తెలుగు పండిట్‌గా చేరి, మూడేళ్లలో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. మరోవైపు ప్రవృత్తిగా కవితా సేద్యం చేస్తూ ఇప్పటికి అమరిన అక్షరాలు, అస్మదీయం, అనంతాకాశంలో కవితా సంపుటాలను వెలువరించారు. పలు అవార్డులను స్వీకరించారు.

పి.సౌజన్య....




పట్టణ ఇందిరానగర్ స్పెషల్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ ఎస్‌జీటీ ఉపాధ్యాయిని పి.సౌజన్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకుంటున్నారు. ఆమె తండ్రి రామచంద్రరావు ఉపాధ్యాయుడు. ఆయనకు గల ముగ్గురు బిడ్డలూ ఉపాధ్యాయ వృత్తిని చేపట్టడం విశేషం. సౌజన్య వారి చిన్న కుమార్తె. డీఎస్సీ-2000 పరీక్షల్లో విజయం సాధించి, తెనాలి మున్సిపాలిటీ టీచరుగా ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. వివిధ పాఠశాలల్లో పనిచేస్తూ, తర్వాత కమిషనర్ కె.శకుంతల ప్రోత్సాహంతో పిల్లలు లేక మూడేళ్లుగా మూసివేసిన ఎంఈ స్కూల్ (ఆది ఆంధ్ర), అయితానగర్ పాఠశాలను తిరిగి తెరిపించి, చక్కగా నడిచేలా దోహదపడ్డారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఎస్ఎంఈ స్కూల్‌ను నాడు-నేడులో సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేశారు.

బెల్లంకొండ వెంకట్...



పట్టణ అయితానగర్‌లోని కేఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖన ఉపాధ్యాయుడిగా చేస్తున్న బెల్లంకొండ వెంకట్ బహుముఖ ప్రజ్ఞావంతుడు. డ్రాయింగ్ హయ్యర్, టీటీసీ కోర్సులు చేశారు. ప్రవృత్తిగా నటన, రచన, గానం, దర్శకత్వం వంటి విభాగాల్లో విశేషంగా కృషిచేస్తున్నారు. ప్రైవేటు శాటిలైట్ ఛానల్‌లో కమర్షియల్ ఆర్టిస్ట్ నుండి యానిమేటర్‌గా ఎదిగి, వ్యక్తిగత కారణాలతో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. రంగస్థల నటుడిగా పలు నాటకాల్లో, తర్వాత రెండు సినిమాల్లోనూ నటించారు. 'సౌత్ ఇండియన్ ఫొటోగ్రఫీ' అవార్డును అందుకున్నారు. మరోవైపు ఎన్‌సీసీ అధికారిగానూ పలు అవార్డులను అందుకున్నారు.

మోర్ల కృష్ణ...



రూరల్ మండలం గుడివాడలోని ఎల్ స్కూల్‌లో ఎస్‌జీటీ టీచర్‌గా చేస్తున్న మోర్ల కృష్ణ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును స్వీకరించనున్నారు. వీరు 2002లో ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. తొలుత నిజాంపట్నం మండలం, తర్వాత చుండూరు మండలంలో పనిచేసి, ఇటీవల గుడివాడకు బదిలీపై వచ్చారు. విద్యాబోధనను నిర్వహిస్తూనే, ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను అంకితభావంతో నిర్వహిస్తున్నారు. అధికారుల మన్ననలు పొందుతున్నారు. ఈ క్రమంలోనే జిల్లాస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు.

ధరల పెరుగుదలపై సీపీఎం ధర్నా

తెనాలి: నిత్యావసర వస్తువులను ప్రజాపంపిణీ ద్వారా ప్రజలకు అందించాలనీ, అదనపు విద్యుత్ ఛార్జీలను రాష్ట్రప్రభుత్వమే భరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సీపీఎం తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్ మాట్లాడుతూ బియ్యంతో సహా అన్ని నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని గుర్తుచేశారు. ఏపీ విద్యుత్ రెగ్యులేటరీ కమిటీ వినియోగదారులపై అదనపు భారం మోపడం సమంజసం కాదన్నారు. వీటి నివారణకు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని కోరారు.

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

తెనాలిరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సీపీఎం తెనాలి కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నిత్యావసర సరుకులు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించాలని, ప్రజలకు ఉపాధి అవకాశాలను మెరుగు పరచాలని, అదనపు విద్యుత్ చార్జీలను ప్రభుత్వమే భరించి వినియోగదారులకు ఊరట కలిగించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ధర్నాలో సీపీఎం జిల్లా నాయకులు ఎన్ భావన్నారాయణ, తెనాలి కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబూ ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదని, ఉపాధి అవకాశాలు రోజురోజుకీ తగ్గిపోతున్నాయని అన్నారు. ఏపీ విద్యుత్ రెగ్యులేటరీ కమిటీ వినియోగదారులపై అదనపు భారాలు మోపడం సమంజసం కాదని అన్నారు. కార్యక్రమంలో ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలి, పి.జోనేష్, కె.రవికుమార్, ఎస్ సుబ్రహ్మణ్యం, బ్రహ్మారెడ్డి, ఎస్ రాజ్యలక్ష్మి, పద్మ, ఆర్ వెంకటేశ్వర్లు, గౌరి, అంజి, లక్ష్మీనారాయణ, కె.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.